ప్రజాశక్తి

సోమవారం 28 నవంబర్ 2022

5

అల్లూరి సీతారామరాజు



దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: చింతపల్లి మండలం లంబసింగి జంక్షన్‌లో గల ఐటిడిఎ గెస్ట్ హౌస్‌ను, క్యాంటీన్‌ను రెండు సంవత్సరాలు లీజుకివ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ప్రకటనలో తెలిపారు. చింతపల్లి మండలం పరిధిలో పదో తరగతి చదివి 21 సంవత్సరాలు నిండిన గిరిజన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ గెస్ట్ హౌస్‌ను పూర్తిగా ఆధునీకరించి సుందరంగా తీర్చిదిద్ది అందించడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన దరఖాస్తులు ఐటిడిఎ కార్యాలయంలో ఈనెల 29వ తేదీ నుండి అందుబాటులో ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రూ.500 చెల్లించి దరఖాస్తులు పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పాడేరు ఐటిడిఎ కార్యాలయంలో అందజేయాలన్నారు. గెస్ట్‌హౌస్, క్యాంటీను నిర్వహణకు అవసరమైన సిబ్బందిని చింతపల్లి మండలం పరిధిలో యువత, యువకులను నియమించుకోవాల్సి ఉంటుందన్నారు. గెస్ట్ హౌస్ నిర్వహణకు, క్యాంటీన్ నడిపేందుకు ఏడాదికి రూ.8 లక్షలు ఐటిడిఎకి చెల్లించేందుకు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

రాందేవ్ బాబా క్షమాపణ చెప్పాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మహిళలపై రామ్ దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్త్రీలకు క్షమాపణ చెప్పాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. అరకువేలి యండపల్లివలస గురుకుల మహిళ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై విద్యార్థులతో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, స్త్రీలు ఎక్కడ గౌరవించబడతారో అక్కడే దేవతలు కొలువై ఉంటారని పురాణాలు చెప్తున్నప్పటికీ మరోవైపు ప్రముఖులు అను కునేవారే స్త్రీల వస్త్రధారణ పై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గరిమెళ్ల నరసింగరావు స్త్రీల వస్త్ర ధారణపై అసభ్యకరంగా చేసిన వ్యాఖ్యలు మరవక ముందే, మరోవైపు రామ్ దేవ్ బాబా స్త్రీలు వివస్త్రలుగా ఉన్నా అందంగానే ఉంటారని అసభ్యకర వ్యాఖ్యలు చేయడం స్త్రీ జాతిని అవమానించడమేనని ఆమె మండిపడ్డారు. స్త్రీలకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. దేశంలో ప్రజలు ఆకలి, నిరుద్యోగం వంటి అనేక రకాల సమస్యలతో సతమతమవుతుంటే వీరికి ఇవేమి పట్ట లేదన్నారు. రామ్ దేవ్ బాబాపై వెంటనే చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ, వార్డెన్ సత్యవతి, మహిళా మండల నాయకులు సన్యాసమ్మ, పిడి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థినులు



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

క్రిమినల్ కేసు పెట్టాలి

ఐద్వా ఆధ్వర్యాన ధర్నా, రాందేవ్ బాబా ఫొటోల దగ్ధం



ఆందోళన చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి- చింతూరు : మహిళల మనోభావాలను కించపరిచే విధంగా మాట్లాడిన యోగా గురువు రాందేవ్ బాబాపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఐద్వా మండల కార్యదర్శి ముర్రం రంగమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం తుమ్మల గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రాందేవ్‌బాబా చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా రంగమ్మ మాట్లాడుతూ, యోగా, ఆయుర్వేదానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిత్యం ప్రచారంలో మునిగి తేలుతున్న రాందేవ్‌బాబా, తనకు జన్మనిచ్చిన తల్లి, తోబుట్టువు కూడా ఆడదేనన్న సంగతి మరచి, బరితెగించి మహిళల వస్త్రధారణపై దిగజారుడు పదాలతో మాట్లాడడం సరికాదన్నారు. బిజెపి మనువాద సిద్ధాంతంతో మహిళలను అణగారిన వర్గాలుగా చూస్తూ, వారితో సహజీవనం చేస్తున్న రాందేవ్ బాబాకు ఇలాంటి మాటలు కాక, మంచిగా ఎలా మాట్లాడగలుగుతారని ప్రశ్నించారు. మహిళలను కించపరిచేలా మాట్లాడిన రాందేవ్ బాబాపై నిర్భయ చట్టం కింద కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు మల్లం సుబ్బమ్మ, మడకం గిరిజ, సోయం కిట్టమ్మ, మొట్టం కిట్టమ్మ, రాజమ్మ, పొడియం రాములమ్మ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు

- 8, 9 తేదీల్లో రాష్ట్ర స్థాయి క్రీడలు

ప్రజాశక్తి-పాడేరు: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా ముగిసాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వివిధ పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లను అందజేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ రమణమూర్తి నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లా స్థాయి క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన తురకలవలస ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు రూ.7500 ప్రైజ్‌మనీ, జ్ఞాపిక, సర్టిఫికేట్ అందజేశామని తెలిపారు. రెండవ బహుమతి కందమామిడి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు రూ.6 వేల ప్రైజ్ మనీ, మూడవ బహుమతి లోచలిపుట్టు బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రూ.4,500 ప్రైజ్ మనీ అందజేసినట్లు ఆయన తెలిపారు. విజేతలు అందరికీ ప్రైజ్ మనీతో పాటు జ్ఞాపికలు సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు డిసెంబర్ 8, 9 తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.



విజేతలతో ఉపాధ్యాయులు

జిల్లాలో వంతెనలు, రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో మారుమూల ప్రాంతాలలో గిరిజనులకు రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు రూ.100కోట్లతో వంతెనలు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామని గిరిజన సంక్షేమ శాఖ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిఆర్ఎం రాజు తెలిపారు. జిల్లాలోని పాడేరు డివిజన్లో రూ.60 కోట్లు, రంపచోడవరం డివిజన్లో రూ.40 కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని ఈ మేరకు అవసరమైన పనులు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. గిరిజన విద్య, రహదారుల అభివృద్ధికై చేపడుతున్న పథకాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే....

రోడ్లు, వంతెనలకు ప్రతిపాదన లేవి?

పాడేరు ఐటిడిఏ పరిధిలో పాడేరు నియోజకవర్గంలో రూ.13 కోట్ల 70 లక్షల వ్యయంతో 22 వంతెనలు రూ 16 కోట్ల 30 లక్షల వ్యయంతో పది రోడ్లు, అరకులోయ నియోజకవర్గంలో రూ.16 కోట్ల 30 లక్షలతో 18 వంతెనలు రూ.13 కోట్ల 70 లక్షలతో రోడ్లకు రూ.60 కోట్లతో ప్రతిపాదన చేసాం. రంపచోడవరం ఐటిడిఏ పరిధిలో రూ.30 కోట్లు, చింతూరు ఐటీడీఏ పరిధిలో రూ.10 కోట్ల వ్యయంతో రోడ్లు, వంతెనల నిర్మాణానికి ప్రతిపాదన పంపించాం.

డోలి హేబిటేషన్లుకు ప్రాధాన్యం

గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిఆర్ఎం.రాజు

పాడేరు ఏజెన్సీలో రోడ్డు సౌకర్యం లేని సుమారు 100 గ్రామాల్ని డోలీ హ్యాబిటేషనుగా ఐటీడీఏ గుర్తించింది. ఇలాంటి ప్రాంతాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాం. ఈ మేరకు సుమారు 51 డోలీ హ్యాబిటేషన్లకు రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది. మొత్తం 264 గ్రామాలకు రవాణా సౌలభ్యం చేకూరుతుంది.

నాడు నేడుతో చేసిన పనులు ఎన్ని?

పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో రూ.111 కోట్ల 35 లక్షల వ్యయంతో 115 ఆశ్రమ పాఠశాలలో 14 గురుకుల పాఠశాలలు 11 కస్తూర్బా గాంధీ పాఠశాలలు 227 ప్రాథమిక పాఠశాలల్లో పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్లాట్ ఫామ్లు, తదితర పనులు చేపట్టి పూర్తి చేశాం.

రెండవ విడతలో మంజూరైన పనులు

పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 284 ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లలో అభివృద్ధి పనుల కోసం రూ.63 కోట్ల 37 లక్షలు మంజూరయ్యాయి. 4 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 42 అంగన్వాడి కేంద్రాలు, 238 ప్రాథమిక పాఠశాలలో అదనపు భవనాల నిర్మాణం, భవనాల మరమ్మతులు, మరుగుదొడ్ల తదితర అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ పనులన్నీ పూర్తి కానున్నాయి.





అటవీ హక్కుల చట్టం అమలులో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సీతారామయ్య

ప్రజాశక్తి -కూనవరం : అటవీ హక్కుల చట్టం-2005ను అమలు చేసి, మన్యంలోని గిరిజనులందరికీ సాగులో ఉన్న భూమికి హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజన సంఘం నేత పాయం సీతారామయ్య డిమాండ్ చేసారు. ఆదివారం నిర్వహించిన గిరిజన సంఘం సమావేశంలో మాట్లాడుతూ, ఇంటి స్థలం లేని గిరిజనులకు అటవీ భూముల్లో ఇల్లు కట్టుకోవడానికి చట్ట ప్రకారం ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. అటవీ హక్కుల చట్టంపై సంబంధిత అధికారులు అవగాహన పెంచుకోవాలని, మన్యవాసులకు ప్రయోజనకరంగా ఉండేలా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అటవీహక్కుల చట్టం అమలులో నిర్లక్ష్యం చూపడం సరికాదని, రాష్ట్ర అధికారులు కూడా అదేబాటన నడవడంతో గిరిజనుల అటవీ హక్కుల ఫలాలు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. 2005కు ముందు సాగుచేస్తున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టం కింద సాగుహక్కు పట్టాలు ఇవ్వకపోగా, అంతకుముందే ఇళ్లు కట్టుకున్న గిరిజనులను సైతం అటవీ అధికారులు నోటీసులు ఇచ్చి బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. కార్యక్రమంలో కొమరం పెంటయ్య, ఎంపిటిసి అమ్మాజీ, సర్పంచ్‌లు శంకర్, నాగమణి, బొగ్గా వెంకమ్మ, రామయ్య పాల్గొన్నారు



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

కార్మికులకు వేతనాలు పెంచాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-పాడేరు:రోజు రోజుకి పెరిగి పోతున్న నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పాడేరులో సిఐటియు మండల మహాసభ కాంతమ్మ సోందేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో దానికి అనుగుణంగా సగటు కార్మికుల జీతభత్యాలు పెరగ లేదన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీతాలు పెంచకపోగా కార్మికులకు కట్టు బానిసలుగా చేస్తున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు పెంచవలసింది పోయి కుదించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. డిసెంబరు 20, 21న నూతనంగా ఏర్పడిన అల్లూరీ జిల్లాలో కార్మిక మహాసభలు జరుగుతున్నాయని, వీటిని కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందర్‌రావు, జిల్లా కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఎలక్ట్రికల్ ఉత్పత్తులను ఎంపిక చేయాలి

- మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు

ప్రజాశక్తి-పాడేరు: మార్కెట్లో లభ్యమయ్యే ఉత్తమ ఎలక్ట్రికల్ ఉత్పత్తులను ఎంపిక చేసి వినియోగదారులకు సూచించాలని మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు సూచించారు. స్థానిక మోద మాంబ కళ్యాణమండపంలో ఆదివారం శ్రీ మోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఎలక్ట్రీషియన్స్ మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గృహ వినియోగదారులు ఎక్కువ మన్నిక కలిగిన ఉత్పత్తులను ఆశిస్తారని వాటికి అనుగుణంగా నాణ్యత గుర్తించి ఎలక్ట్రికల్ ఉత్పత్తులను ఎంపిక చేయాలని, అప్పుడే వారు సంతృప్తి చెందుతారని చెప్పారు. సేఫ్టీ కూడా చాలా ముఖ్యమన్నారు. నాడు నేడు కింద అనేక పాఠశాలలకు కొత్తగా ఎలక్ట్రిఫికేషన్ జరుగుతోందని, ప్రభుత్వం కూడా దీర్ఘకాలం మన్నిక కలిగే ఎలక్ట్రికల్ ఉత్పత్తులు వాడాలని సూచిస్తోందని చెప్పారు. వినియోగదారులు సంతృప్తి చెందితే ఆ కంపెనీ ప్రొడక్ట్స్‌కు ఆదరణ ఉంటుందన్నారు. అనంతరం ఫైబ్రోస్ ఎలక్ట్రికల్ ఉత్పత్తులపై ఎలక్ట్రీషియన్లకు, స్థానిక మర్చంట్లకు, కంపెనీ సూపర్వైజర్లు అవగాహన కల్పించారు. ఫైబ్రోస్ బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సింహాచలం నాయుడును మర్చంట్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ సభ్యులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి హార్డ్ వేర్ అండ్ ఎలక్ట్రికల్స్ యజమాని సత్యవరపు రామచంద్రరావు, ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదరం, ఉపాధ్యక్షుడు వరప్రసాద్, ట్రెజరర్ చంటి, ఎలక్ట్రీషియన్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




సింహాచలం నాయుడును సన్మానిస్తున్న సభ్యులు

పోలీస్ స్టేషన్‌ను పునరుద్ధరించరూ..

- 15 ఏళ్లుగా నిరుపయోగంగా భవనం
- అసాంఘిక చర్యలకు నెలవైన వైనం
- తక్షణ చర్యలకు స్థానికుల వేడుకోలు

ప్రజాశక్తి- విఆర్.పురం: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌ను పునరుద్ధరించాలని మండల వాసులు కోరుతున్నాను. సుమారు15 ఏళ్ళ క్రితం స్థానికంగా పోలీస్ స్టేషన్ ఉండగా, దానికోసం ఏర్పాటు చేసిన భవనం ఇపుడు నిరుపయోగంగా ఉంది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనంలో కార్యకలాపాలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ లేకపోవడంతో, ప్రతి అవసరానికి కూనవరం వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురికాక తప్పడం లేదని స్థానికులు అంటున్నారు. పోలీస్ స్టేషన్ అవసరాలకు చొప్పలి, రామవరం, చింతరేగుపల్లి తదితర గ్రామాల ప్రజలు సుమారు 25 కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తే గానీ పోలీస్‌స్టేషన్ చేరుకోలేని పరిస్థితి ఉందని అంటున్నారు.

పోలీస్‌స్టేషన్ స్థానికంగా అందుబాటులో ఉంటే, కోడిపందేలు, జూదం, దొంగతనాలు ఇతర అసాంఘిక చర్యలు అరికట్టేందుకు వీలుంటుందని మండల వాసులు కోరుతున్నారు. ఏదేమైనా పోలీస్‌స్టేషన్ మండల కేంద్రంలోనే ఉండడం అవసరమని, పలు గ్రామాల వద్ద ముఖ్యకూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు చేపట్టడం ద్వారా మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం

సత్యసాయి వాటర్ వర్కర్ల ఆకలి కేకలు పట్టవా ?

నాలుగో రోజుకు కార్మికుల దీక్షలు



దీక్షాశిబిరంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -రంపచోడవరం : సత్యసాయి వాటర్ వర్కర్స్‌కు రావాల్సిన పదినెలల వేతన బకాయి వెంటనే చెల్లించాలని కోరుతూ రంపచోడవరం ఐటిడిఎ ఎదురుగా చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ, ఏజెన్సీలో గిరిజనులకు తాగునీరు అందిస్తున్న సత్యసాయి ట్రస్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కాంట్రాక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పది నెలల వేతనాలు ఇవ్వకపోతే కార్మికుల కుటుంబాలతో ఎలా బతకాలో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా అనేక గ్రామాలలో తాగునీరు అందక ఇప్పటికే గిరిజనులు నానా ఇబ్బందులు పడుతున్నారని, సత్యసాయి వాటర్ వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే, వారి విధులను బహిష్కరిస్తే అన్ని గిరిజన గ్రామాలలో నీటిఎద్దడి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, వాటర్ వర్కర్స్ పది నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జగన్ పాలనలో రాష్ట్రంలో అరాచకం

'ఇదేం ఖర్మ' ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి



సింగంపల్లిలో 'ఇదేం ఖర్మ' ఆందోళనలో టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని రంపచోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, పార్టీ పరిశీలకులు యర్రా వేణుగోపాల్ ధ్వజమెత్తారు. ఆదివారం రాజవొమ్మంగిలో మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' బాదుడే బాదుడు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా సింగంపల్లి నుంచి జడ్డంగి వరకు టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జడ్డంగి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జమ్మిసావిడిలో వద్ద నిర్వహించిన బహిరంగ సభలో మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబు రమేష్, పార్టీ పరిశీలకులు యర్రా వేణుగోపాల్ తదితరులు మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ పాలనలో సామాన్య మధ్యతరగతి ప్రజలుతోబాటు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడిపి, ఇతర ప్రతిపక్షాలపై, గిరిజనులపై దాడులు విపరీతంగా పెరగాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తున్న టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులపై నిర్బంధం కొనసాగిస్తోందని, అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వైసిపి పాలనలో ఏజెన్సీలో ఇసుమంతైనా అభివృద్ధి జరగలేదని, కనీస వసతులు లేక గిరిజనం నానా ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. మరోవైపు ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల బతుకులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దుర్భరం చేశాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో టిడిపి కేడర్ సర్వసన్నద్ధంగాఉండాలని, తెలుగుదేశం గెలుపు, చంద్రబాబును సిఎం చేయడమే లక్ష్యంగా అందరం సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షులు డి శివరామచంద్రరాజు, మండల కార్యదర్శి ఎం.డింబకేశ్వరరావు, టిడిపి జిల్లా, మండల నేతలు జి సునీత, నిరంజనీదేవి, శ్రీకాంత్, టి ప్రభ, బోసుబాబు పాల్గొన్నారు.

మన్యం అందాలలో మైమరచిన సందర్శకులు



పొగమంచులో సెల్ఫీలతో సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి -సీలేరు: మంచు దుప్పటి కప్పుకున్న సీలేరు అందాలు, ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆదివారం పర్యాటకులు క్యూ కట్టారు. సెలవుదినం కావడంతో ఉదయాన్నే ఆరుగంటలకే సీలేరు నది పరివాహక ప్రాంతాలకు చేరుకున్న పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అక్కడ సాక్షాత్కారమైన అందాలను చూసి, మైమరిచిపోయారు. ఆదివారం తెల్లవారుజామునే సీలేరు డ్యామ్ వద్దకు చేరుకున్న సందర్శకులు మంచు ముసుగులో కనీకనబడని రీతిలో దర్శనమిచ్చిన ప్రధాన డ్యామ్‌పై సందడి చేశారు సెల్ఫీలు, ఫొటోలకు ఫోజులిస్తూ, జ్ఞాపకాలను పదిలపరచుకోవడంలో మంత్రముగ్ధులై మునిగిపోయారు. రిజర్వాయర్ చివర, నది పరివాహకంలో ఉన్న వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, మధురానుభూతులకు లోనయ్యారు. ఆంధ్రాఒడిశా సరిహద్దుల్లో ఉన్న చిత్రకొండ చిల్డ్రన్ పార్క్‌లో బోటు షికారు చేసి సంతోషంగా గడిపారు. తారాబు, జడిగూడ వద్ద జాలువారే జలపాతాలు, గిరిజనులు ఆచార సంప్రదాయాలను తిలకించి సంతోషంగా గడిపారు. సీలేరు, పరిసర ప్రాంతాల్లోని అందాలను చూసేందుకు ఇక్కడ రాత్రి బస చేసిన పర్యాటకులు, అన్నింటిని చూసి, ఆస్వాదించిన తర్వాత ఇక్కడ లాడ్జీల్లో బస చేసి, ఫైర్ క్యాంపుల్లో చలిమంటలు వేసుకుని, చలి నుంచి ఉపశమనం పొందడం ద్వారా మధురానుభూతికి లోనయ్యారు.



పొగమంచు దుప్పటిలో సీలేరు డ్యాం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేత ప్రభుదాస్

ఆశ్రమాల్లో మెనూ అమలుపై టాస్క్‌ఫోర్స్ : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన విద్యార్థులకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాల వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు కా లేదని, జిల్లా కలెక్టర్ దీనిపై స్పందించి గిరిజన విద్యార్థులకు మెనూ అమలు పర్యవేక్షణకు టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ కార్యదర్శి ప్రభుదాస్ డిమాండ్ చేశారు. పాడేరులో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో ఇతరులను అనుమతించవద్దని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన నిషేధ ఉత్తర్వులతో ఇక ఆశ్రమాల్లో నిర్వహణ ఇష్టారాజ్యంగా మారుతుందని, ఇప్పటికే గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు కాలేదని అన్నారు. విద్యార్థి, యువజన, గిరిజన, మీడియా తదితర సంఘ ప్రతినిధులను పాఠశాలకు అనుమతించ కూడదని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వులను ఎస్‌ఎఫ్‌ఐ ఖండిస్తోందని చెప్పారు. అనేకచోట్ల వసతి గృహ నిర్వాహకులు అడ్డగోలుగా వ్యవహరిస్తూ ఉడికి ఉడకని ఆహారాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్నారన్నారు. రక్త హీనతతో బాధపడుతున్న గిరిజన చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, ప్రభుత్వం మెను ప్రకారంగా అమలు చేయకపోవడంతో సికిల్ సెల్ ఎనీమియాతో ఉన్న గిరిజన విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నా అని చెప్పారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో చర్మ వ్యాధులతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు. చలికాలం కావడంతో రగ్గులు, దుప్పట్లు, స్వెటర్స్ పంపిణీ చేయక పోవడంతో పాటు సబ్బులు సరఫరా ఆపి వేయడంతో చర్మవ్యాధులను బారిన పడి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాస్మొటిక్‌కి చెల్లించవలసిన నిధులను అమ్మఒడి పథకంకు వెచ్చించడంతో కాస్మోటిక్స్ విద్యార్థులకు సరైన సమయంలో ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు చిన్నారావు, జీవన్ కుమార్, ప్రసాద్, కార్తిక్, లోకేష్ పాల్గొన్నారు.


వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ నరేంద్ర ప్రసాద్

ముమ్మర వాహన తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని కింద్ర రోడ్డు జంక్షన్ వద్ద స్థానిక ఎస్ఐ టిజి.నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. జడ్డంగి, రాజవమ్మంగి ప్రధాన రహదారి మీదుగా వచ్చిపోయే వాహనాలన్నింటినీ ఆపి నిశితంగా తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డులు పరిశీలించి రికార్డులు సక్రమంగా లేని పలువురు వాహనదారుల నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనదారులకు ఎస్ఐ నరేంద్ర ప్రసాద్ పలు సూచనలు చేశారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం, అతివేగం, పరిమితికి మించి ఎక్కువ మంది వాహనాల్లో ఎక్కించడం, గంజాయి నాటుసారా తదితర నిషేధిత వస్తువులను రవాణా చేయడం వంటికి చట్టప్రకారం నేరం, శిక్షార్హమేనన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహన పత్రాలన్ని అప్‌టుడేట్‌గా ఉండాలని సూచనలు చేశారు. ట్రాఫిక్ నిబంధలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌పి, లోకల్ పోలీసులు పాల్గొన్నారు.

'చాపరాయి'లో పర్యాటకుల ఇక్కట్లు

మరుగుదొడ్లు ఉన్నా..వాడుక నీటి సౌకర్యం కరువు
అధికారుల నిర్లక్ష్యంతో తప్పని అవస్థలు


నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: ఆంధ్ర ఊటీ అరకు పర్యాటక ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా ప్రకృతి అందాలతో మైమరపించే చాపరాయి జలపాతం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కార్తీక మాసంతో పాటు ఏడాది పాటు నిత్యం పర్యాటకులు అధిక సంఖ్యలో చాపరాయికి తరలి వస్తుంటారు. పర్యాటకుల సౌకర్యార్థం కనీస మౌలిక సౌకర్యాలు లేక పోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో పర్యాటకుల సౌకర్యార్థం అధికారులు మరుగుదొడ్లు నిర్మించారు. ఇప్పటివరకు వాడుక నీటి సౌకర్యం కల్పించక పోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా మహిళ పర్యాటకులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. నీటి సౌకర్యం కల్పించక పోవడంతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు ఉపయోగంలో లేక నిరుపయోగంగా మారాయి. ఇక్కడ సందర్శించిన పర్యాటకులు చాపరాయి జలపాతంలో సరదాగా చిన్న, పెద్ద తేడా లేకుండా కుటుంబ సమేతంగా జారుతూ స్థానాలు చేస్తుంటారు. వీరికి బట్టలు మార్చే గదులతో పాటు మరుగుదొడ్లు, వాడుక నీరు, తాగునీటి సౌకర్యం కూడా కల్పించక పోవడంతో పర్యాటకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను అధికారులు ప్రతి ఏడాది ప్రవేశరుసుం, పార్కింగ్ రుసుం పేరిట టెండర్ వేలం పాట నిర్వహిస్తున్నారు. గత ఏడాది సుమారు రూ.30 లక్షలు వేలంపాట నిర్వహించగా, ఈ ఏడాది రూ.32 లక్షలు వరకు పాట నిర్వహించారు. వచ్చిన నిధులతో అక్కడ ప్రమాదకర వాగు ప్రదేశాల్లో ఇనప కంచెలు నిర్మించి, మెర్క్యూరీ వీధి దీపాల అలంకరణ, గార్డెన్, మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు పలు సౌకర్యాలను కల్పించారు. ప్రధానంగా నిర్మించిన మరుగుదొడ్లులో వాడుక నీటి సౌకర్యం కల్పించకపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన మరుగుదొడ్లు ఎందుకు ఉపయోగం లేకుండా పోతున్నాయని పలువురు పర్యాటకులు, స్థానికులు తెలిపారు. జలపాతంలో సరదాగా స్నానాలు చేసిన తర్వాత ఆరుబయట చీరలను అడ్డుపెట్టుకొని బట్టలు మార్చ వలసిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు మహిళ పర్యాటకులు వాపోతున్నారు. పలుమార్లు ఐటిడిఏ పిఓ, సబ్ కలెక్టర్ పర్యటించినా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో చర్యలు తీసుకోలేదు. కార్తీకమాసంలో రోజుకు వేలాది మంది ఇక్కడ పర్యాటకులు సందర్శిస్తున్నారు. వారికి ఇబ్బందులు కలగకుండా తగినటువంటి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చాపరాయి జలపాతంలో నిర్మించిన మరుగుదొడ్లలో వాడుక నీటి సౌకర్యం కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.


భవనం పనులను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి

అంగన్‌వాడీ భవనం పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-హుకుంపేట: అంగన్వాడి భవనం మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని జెడ్పిటిసి రేగం మత్స్య లింగం కోరారు. మండలంలోని సూకురు పంచాయతీ చట్రాయిపుట్టులో అంగన్వాడీ భవనం మరమ్మతులు పనులను ఆదివారం జెడ్పీటీసీ తనిఖీ చేశారు. అంగన్వాడి మరమ్మతు త్వరగా చేపట్టి భవనం పూర్తిస్థాయి అందుబాటులోకి తేవాలని సూచించారు. అనంతరం భారామసి పంచాయతీ బారపల్లి, బారమాసి, నీలంపుట్టు తదితర గ్రామాలను సందర్శించి సమస్యలపై స్థానిక సర్పంచ్‌తో సమీక్షించ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెటికేరి ముత్యాలమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఏజెన్సీ మహిళ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.ధర్మ ఆధ్వర్యంలో ఆదివారం డుంబ్రిగూడ మండలం కండ్రుం పంచాయతీ బెడ్డగూడ గ్రామంలోని నిరుపేద గిరిజనులకు వస్త్రాలు, సబ్బులు, పేస్టులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో అనేకమంది గిరిజనులు ఇప్పటికీ నిరుపేదలుగా ఉన్నారని చెప్పారు. అటువంటి వారికి ఎంతో కొంత సాయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ సరఫరా ఏదీ?

రేషన్ వాహనాలకు కానరాని రోడ్డు సౌకర్యం
డిపోలకే పరిమితమవుతున్న గిరిజనం


డిపో వద్ద రేషన్ తీసుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి- హుకుంపేట: నిత్యావసర సరుకులు సరఫరా చేసే రేషన్ వాహనాల సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇంటి ఇంటికి సరుకులు అందించేందుకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలో ఇది ఒక్కటి. రేషన్ సరఫరా చేసే వాహనాలు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక గిరిజనులకు రేషన్ కష్టాలు తప్పడం లేదు. కాలిబాటన రేషన్ సరుకులు మోత మోసుకోవాల్సి వస్తుంది. మండలంలోని పలు పంచాయతీలో నిత్యావసర సరుకులు సరఫరా చేసే వాహనాలు వెళ్ళేందుకు మార్గం లేదు. మండంలోని 33 పంచాయతీలు ఉన్నాయి. ఈ 33 పంచాయతీలకు 11 రేషన్ వాహనాలు ఉన్నాయి 3 డిపోలకు ఒక్క రేషన్ సరఫరా వాహనం ఉంది. మండలంలోని పలు గ్రామాలకు రహదారి సౌకర్యం లేక వాహనాలు వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాలకు వాహనాల ద్వారా సరకులు సరఫరా కాలేదు. ఒల్దా పంచాయతీ వాకపల్లి, గున్నమామిడి, గత్తుం పంచాయతీలో కరకావలస, జంగంపుట్టు, డాలిం పుట్టు, గాలిపడు, వెల్గపాడు, పట్టాం పంచాయతీ కోడి తల, అమనగిరి, బూరువలస, గంగుడి, పనస పుట్టు, నడువిధీ బూర్జ పంచాయతీ పటకడవడా, సుల్లిపకొని, సోంటర్లపాడు, దిగాసంతాంగి, ఎగసంతాంగి, తుంబవలస, డుంబ్రిగూడ, వసనరంగిడి, కుసుమ వలస, జాకర వలస, తిగలవలస పంచాయతీ పనసబంధ, కిన్నేరులోవ, గుర్రాలతోట, తడిగిరి పంచాయతీ కొండ చిడీపుట్టు, బంరంగి బంధ, బొడ్డపుట్టు పంచాయతీ ఎర్ర గొప్పుగ్రామం మత్స్య పురం పంచాయతీ కొత్తవలస, ఊటగెడ్డ, బంగారు మెట్ట, బురుగులు, రాళ్ళ మత్స్య పురం, దుర్గం పంచాయతీ రణంకొట, బియ్యం గురువు, గన్నేరుపుట్టు పంచాయతీ ముదుము, పొర్లు, గొప్పు గరువు,, సంపగిపుట్టు, చికు మద్దుల పంచాయతీ రంగరాజుపల్లి, చిన్న నంది పుట్టు, కరెగరువు, మచ్చులమమీడి, గుమ్మడి గుంట, గిల్లా బడ్డు, జాగ్రకొండ పంచాయతీ గరస గరువు, బందగరువు, పిచుమమీడి, సిసాయిపనుకు, బురదగుమ్మి, డిగ్రపల్లి, తొటమామిడి, గనిక, పొర్లు, జాగ్రకొండ అండిభ పంచాయతీ 6 గ్రామాల్లో వాహన సేవలు అందుబాటులో లేవు. ఈ గ్రామాల్లో రహదారి సౌకర్యాలు సరిగ్గా లేక పోవడంతో నిత్యావసర సరుకులు సరఫరా చేసే వాహనాలు సేవలు అందుబాటులో లేవు. ఈ పంచాయతీల్లో రేషన్ డిపోలు ఉన్నాయి. కాలినడకక వెళ్లి డిపోల్లో రేషన్ తెచ్చుకుంటున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

రహదారి సౌకర్యం కల్పించి సేవలు అందుబాటులో తేవాలి. రహదారి సౌకర్యం లేకపోవడంతో సేవలు అందుబాటులోకి లేవు. కాలిబాటన రేషన్ సరుకులు మోతకు ఎంతో ఇబ్బందులు పడుతున్నాం.

సిదారి సూరి బాబు, రైతు

ప్రజా ధనం వృథా


ప్రజా ధనాన్ని రేషన్ వాహనాల పేరుతో వేలకోట్లు దుర్వినియోగం అవుతున్నాయి. ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు పంపిణీ లేదు.

తామర్ల సత్యనారాయణ
అండిభ సర్పంచ్



మాట్లాడుతున్న సుందరయ్య

ఆర్‌టిసిలో అద్దె బస్సుల విధానం వద్దు

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌టిసిలో అద్దె బస్సుల విధానాన్ని పూర్తిగా రద్దు చేసి సంస్థ తరుపున సొంత బస్సులు నడపాలని ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా పదో మహాసభలు ఆదివారం జివిఎంసి కార్యాలయానికి ఎదురుగా ఉన్న బిఎస్‌ఎన్‌ఎల్ యూనియన్ కార్యాలయంలో జరిగాయి. సభలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ వారికి ఎటువంటి సంక్షేమ పథకాలూ అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆర్థిక అంశాలు పరిష్కారం కాలేదన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2017 నుంచి ఆర్‌టిసి కార్మికులకు ఉన్న బకాయిలను, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను రద్దు చేయాలన్నారు. పాత పద్ధతిలోనే రిఫెరల్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 15, 16 తేదీల్లో నెల్లూరు పట్టణంలో జరుగనున్నాయని, ఆ సభలను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.సీతాలక్ష్మి, రీజియన్ అధ్యక్షులు పిఎస్.నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎం.చిన్నప్పడు, సిహెచ్.నారాయణ, కెజిపి.రావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వి.తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.


సాయిపద్మకు కారు తాళం అందిస్తున్న వరుణ్ మారుతీ నిర్వాహకులు

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక రాయితీపై కారు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక రాయితీపై వరుణ్ మారుతీ సంస్థ కారును అందిస్తోంది. దీనిలో భాగంగా వికలాంగుల హక్కులు, సాధికారత కోసం కృషి చేస్తున్న గ్లోబల్ ఎయిడ్ సంస్థ వ్యవస్థాపకురాలు సాయి పద్మ సిరిపురం వరుణ్ మారుతి సంస్థ ద్వారా వికలాంగులకు ఇచ్చే ప్రత్యేక రాయితీలో వేగన్ ఆర్ ఆటోమేటిక్ ట్రాన్సిమిషన్ కారును కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ సెంట్రల్ గవర్నమెంట్ వికలాంగులు ప్రత్యేకంగా కారు లేదా ఏదైనా నాలుగు చక్రాల వాహనం కొనుక్కుంటే లైఫ్ ట్యాక్స్‌లో పూర్తి రాయితీ, జిఎస్‌టిలో పది శాతం రాయితీ అందిస్తోందన్నారు. ఒక శాతం సెస్ కట్టనవసరం లేదన్నారు. కారు కొనుగోలుకు తనకు మారుతీ సంస్థ పూర్తి సహకారం అందించిందని తెలిపారు. వరుణ్ మారుతీ సంస్థతో కలిసి గ్లోబల్ ఎయిడ్ త్వరలో ఈ విషయాలపై వర్క్‌షాప్ నిర్వహించనుందన్నారు. కార్యక్రమంలో వరుణ్ మారుతి సిజిఎం అబ్బాస్, బ్రాంచ్ హెడ్ నవీన్ పాల్గొన్నారు.

పోలీసు ఉదాసీనత

నర్సీపట్నంలో కొనసాగుతున్న అసాంఘిక కార్యకలాపాలు
మొన్న బాలికల వసతి గృహంలో ఆకతాయిల హల్‌చల్
నిన్న కల్యాణ్ లాడ్జిలో వెలుగుచూసిన వ్యభిచార వ్యవహారం
తాజాగా బ్రాహ్మణ వీధిలోని అద్దె ఇంట్లో బయటపడ్డ గంజాయి, కండోమ్ ప్యాకెట్లు
వ్యాపారి వెలగ నారాయణరావుపై స్థానికుల ఫిర్యాదు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నర్సీపట్నం టౌన్ విలేకరి

ఏజెన్సీకి ముఖద్వారమైన నర్సీపట్నం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వుంది. కొంతకాలం రంగురాళ్ల వ్యాపారాలకు, ఇప్పుడు గంజాయి వ్యాపారులకు ఇదొక కేంద్రంగా తయారైంది. పాడేరు ఏజెన్సీలో పండిన గంజాయి రవాణాకు మూలాలన్నీ ఇక్కడే ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. గంజాయి రవాణాకే ఇప్పుడిది పరిమితంకాలేదు. అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. నర్సీపట్నం మున్సిపాల్టీ 24వ వార్డులోని బ్రాహ్మణవీధిలో వెలగ నారాయణరావుకు చెందిన ఇంట్లో అద్దెకు వుంటున్న యువకులు శనివారం రాత్రి సృష్టించిన బీభత్సంతో ఇది వెలుగులోకి వచ్చింది. స్థానికులు పోలీసు స్టేషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో... కొన్ని సంవత్సరాలుగా నారాయణరావు అద్దెకు ఇచ్చిన ఇంట్లో ఇల్లీగల్ యాక్టివిటీస్ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది కుర్రోళ్లు జంటజంటలుగా అమ్మాయిలను తీసుకొస్తున్నట్టు తెలిపారు. రాళ్లకు చుట్టిన కండోమ్‌లు, మద్యం సీసాలను మేడ పై నుంచి విసిరేవారని పేర్కొన్నారు. మహిళలు ఇదే విషయాన్ని ఇంటి యజమాని నారాయణరావు దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఫిర్యాదులో వివరించారు. శనివారం రాత్రి మేడపై నుంచి రాళ్లకు చుట్టిన కండోమ్‌లు కిందపడటంతో కొంతమంది మహిళలు అడుగుదామని వెళ్లే సరికి వారంతా తమ బ్యాగులు పట్టుకొని పారిపోయారు. ఈ విషయం కౌన్సిలర్ మధు ద్వారా పోలీసులకు సమాచారమివ్వడంతో వారొచ్చి తలుపులు తీసి చూడగా గదుల్లో సిగరెట్ ముక్కలు, కండోమ్ ప్యాకెట్లు, గంజాయి వున్నాయి. అద్దెకు వున్న యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయం ఇంటి యజమాని నారాయణావుకు దృష్టికి తీసుకెళ్లినా, ఆయన వారిని ఖాళీ చేయించకపోవడం, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ఆయనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసులు చిత్తశుద్ధితో లోతైన విచారణ చేపడితే నారాయణరావుకు, అద్దెకు వుంటున్న యువతకు వున్న సంబంధాలు బయటపడతాయన్న అభిప్రాయం స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది. వ్యాపారైన నారాయణరావుకు వున్న పలుకుబడితో ఇంతకాలం తాను అద్దెకిచ్చిన ఇంట్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పోలీసులకు తెలిసినా వారు పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల నిర్లక్ష్యమే ఈ తరహా కార్యకలాపాలు పెరగడానికి దారితీస్తున్నాయన్న వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 22న అర్ధరాత్రి వేములపూడి ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో


బ్రాహ్మణ వీధిలోని అద్దె ఇంట్లో బయటపడ్డ గంజాయి, కండోమ్ ప్యాకెట్లు

నిద్రిస్తున్న బాలికల గదుల్లోకి వెళ్లి అల్లరి చేసిన యువకులపై సరైన చర్యలు తీసుకోలేదు. కొంతమంది యువకులు ప్రహరీ దూకి వసతి గృహంలోపల గదిలోకి వెళ్లి ఓ అమ్మాయి కాళ్లుపట్టుకొని లాగిన విషయం వెలుగులోకి రాకుండా చూశారు తప్ప ఆకతాయిలను పట్టుకోవడానికి ఆనాడు గట్టి ప్రయత్నం చేయలేదు. నర్సీపట్నంలోని శ్రీకళ్యాణ్ లాడ్జిలో వ్యభిచార రాకెట్ నడుపుతున్న కాకినాడకు చెందిన మహిళకు బిజెపికి చెందిన ఎర్రినాయుడు సహకరిస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. కొల్‌కతా, బీహార్, ఢిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చినట్లు అప్పుడు దుమారం రేగింది. లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, కండోమ్‌లు లాడ్జి నుంచి బయటవేస్తున్నారని స్థానిక మహిళలు సమాచారమిచ్చిన తరువాతే పోలీసులు దాడులు నిర్వహించారు. స్మార్ట్ విలేజ్ క్లస్టర్ ఎగ్జిక్యూటివ్, క్లస్టర్ అసిస్టెంట్ ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి వందల కోట్లు వసూలు నర్సీపట్నం కేంద్రంగా జరిగింది.

పోలీసుల నిర్లక్ష్యంపై విమర్శలు

అసాంఘిక, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలను నియంత్రించే చర్యలు పోలీసులు తీసుకోవడంలేదన్న విమర్శ ప్రజల నుంచి బలంగా వినిపిస్తోంది. అద్దె ఇళ్లల్లో, లాడ్జిల్లో గంజాయి వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకొచ్చి మకాంవేసి వ్యాపారాలు సాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యాపారుల పట్ల పోలీసులు ఉదాసీనంగా వుండడంతో ఈ తరహా సంఘటనలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాల వికాస్ ఫౌండేషన్, మానవతా స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా మైండ్‌ఫుల్ పారెంటింగ్ అంశంపై విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించారు. మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆచార్య అర్.సుదర్శనరావు, ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పాల్గొన్నారు. నేడు బాలలు, పెద్దలు మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని తెలిపారు. టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. పిల్లల జీవన నైపుణ్య వికాస నిపుణులు పయాజ్ మాట్లాడుతూ పిల్లలు తమ సమయాన్ని అర్థవంతంగా, సృజనాత్మకంగా వినియోగించుకునేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. వారి నడవడికపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఆచార్య పరమేశ్వరరావు, రామకృష్ణ, ఈదర రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు పయాజ్ సమాధానాలిచ్చారు.



నిరసన తెలుపుతున్న ఎఐవైఎఫ్ నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై ఎఐవైఎఫ్ నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహం వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ వై.రాంబాబు మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో, కమ్యూనిస్టులు, ప్రజల ఉద్యమాలతో విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా విశాఖపట్నంలో ఉధృత ఉద్యమాలు సాగుతున్నాయన్నారు. ప్రజల మనోభావాలను లెక్క చేయకుండా నాలుగు రోజుల క్రితం అదానీ సంస్థ డైరెక్టర్లు స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించడానికి రావడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రభుత్వరంగ సంస్థల స్థాపనలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల పాత్ర ఎంత ఉందో పార్లమెంటు సాక్షిగా ప్రధాని చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడమే ధ్యేయంగా మోడీ సర్కారు పని చేస్తోందన్నారు. ప్రయివేటీకరణ చర్యలను అడ్డుకుంటామని తేల్చిచెప్పారు.

ఫ్యాక్షన్ వ్యవహారాలకు టిడిపి ప్రయత్నం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అనంతపురం జిల్లాలో మరోసారి ఫ్యాక్షన్ వ్యవహారాలకు తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోందని ఆ జిల్లాకు చెందిన రాప్తాడు వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం సాయంత్రం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలో చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే వైసిపి కార్యకర్తలపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు. టిడిపి నాయకులు పరిటాల రవి ప్రయివేటు సైన్యం చేసిన అకృత్యాలు అప్పుడు చంద్రబాబు నాయుడుకు కనిపించలేదా ? అని ప్రశ్నించారు. అప్పట్లో టిడిపి మాజీ నాయకులపై కూడా పరిటాల రవి బాంబుల దాడులు జరిపిస్తే చంద్రబాబు నాయుడు అడ్డుకోలేదని తెలిపారు. తన సోదరుడును హత్య చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన తండ్రి ఆరోగ్యం బాగోలేక తమ కుటుంబం శోకంలో ఉండగా రాప్తాడు ఎమ్మెల్యే కనిపించడం లేదని టిడిపి నాయకులు ప్రచారం చేయడం శోచనీయమన్నారు. టిడిపి నేతలు చేస్తున్న ప్రచారానికి మదనపడి తన సోదరుడు వారిపై ఆరోపణలు చేశారని, అయితే ఆయన వాడిన భాష సరైనది కాదని అన్నారు. ఆవేదనలో మాట్లాడారని, అందులో వాస్తవాలు ఉన్నాయనే విషయాలను గుర్తించాలని తెలిపారు. పరిటాల శ్రీరామ్‌ను హత్య చేస్తారన్న బెదిరింపులు వెనుక చంద్రబాబు, లోకేష్ ఉన్నారని ఆరోపించారు. మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించింది వైసిపి ప్రభుత్వమేనన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఫ్యాక్షన్ రాజకీయాలకు తావులేదన్నారు.

పుస్తక మహోత్సవంలో దేశభక్తి గీతాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టర్నర్ చౌల్ట్రీలో నిర్వహిస్తున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలు ఆలపించారు. శ్రీ సాయి కళానికేతన్ బృందం వారిచే చక్కని నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి మాట్లాడారు. కుల, మతతత్వాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన నిలిచి, రైతులు, కార్మికులు, మహిళలు, ఉద్యోగుల హక్కులపై ప్రజానాట్యమండలి నిరంతరం పాటలు, నాటికలు, నృత్యాలు ప్రదర్శిస్తూ అనేక కళారూపాలను తయారుచేసి ప్రజల్లోకి తీసుకువెళ్తోందన్నారు.